సాక్షి రంగారెడ్డి

గురువారం । 14 । సెప్టెంబర్ । 2023



సస్యశ్యామలం

పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుతో నియోజకవర్గం సస్యశ్యామలమవుతుందని ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ అన్నారు. 8లో▸



కబ్జా చేస్తే ఊరుకోం

ఆలయాల భూములను కబ్జా చేస్తే సహించేది లేదని దేవాదాయ ధర్మాదాయ శాఖ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ శేఖర్ అన్నారు. 8లో▸



కడ్తాల్ విద్యార్థుల సత్తా

ఎస్‌జీఎఫ్ జోనల్ అండర్-17 వాలీబాల్ పోటీల్లో కడ్తాల్ విద్యార్థులు ప్రతిభ కనబరచి ప్రథమ స్థానంలో నిలిచారు. 8లో▸

న్యూస్‌రీల్

రామకృష్ణారెడ్డికి బీజేవైఎం వారియర్ అవార్డు



ఈటల చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న రామకృష్ణారెడ్డి

బడంగ్‌పేట్: బడంగ్‌పేట్ కార్పొరేషన్ బీజేవైఎం అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి.. 2020-23 బీజేవైఎం వారియర్ అవార్డుకు ఎంపికయ్యారు. హుజూరాబాద్ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఎన్నికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ చేతులమీదుగా బుధవారం రామకృష్ణారెడ్డి ఈ అవార్డును అందుకున్నారు. రామకృష్ణారెడ్డి బీజేవైఎం అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన అనతికాలంలోనే పార్టీలో యువతను చేర్పించడంతో పాటు ప్రజా సమస్యలపై నిరంతరం ఆందోళనలు కార్యక్రమాలు చేపట్టారు. లాఠీదెబ్బలు తినడంతో పాటు పలుమార్లు అరెస్టు అయ్యారు.రామకృష్ణారెడ్డి డెడికేషన్‌ను గుర్తించిన అధిష్టానం అతడిని బీజేవైఎం వారియర్ అవార్డుకు ఎంపిక చేసింది. తనకు అవార్డు రావడానికి సహకరించిన జిల్లా బీజేవైఎం అధ్యక్షుడు యాదీష్, బీజేపీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల, బీజేపీ పెద్దలకు రామకృష్ణారెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించండి

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు

కొందుర్గు: అంగన్‌వాడీల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో చేపట్టిన అంగన్‌వాడీల నిరాహారదీక్షకు బుధవారం సీఐటీయూ నాయకులు మద్దతు తెలిపారు.అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది మోకాళ్లపై కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ... ఏళ్లుగా సమస్యల పరిష్కరించాలని అంగన్‌వాడీలు ఆందోళన చేపడుతున్నా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ కేంద్రాలకు పక్కా భవనాలను నిర్మించి అందులో అన్ని సదుపాయాలు కల్పించాలన్నారు. అంగన్‌వాడీల్లో ఖాళీలను భర్తీచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు జంగయ్య, గోపాల్, అనురాధ, శారద, భాగ్య, లింగమ్మ, రజియా, మౌనిక, నిర్మల, కృష్ణవేణి పాల్గొన్నారు.

మత్స్యకారులకు అండగా ఉంటాం

ఎమ్మెల్యే యాదయ్య



చందనవెళ్ల చెరువులో చేపపిల్లలను వదులుతున్న ఎమ్మెల్యే యాదయ్య

షాబాద్: చేపల పెంపకంతో మత్స్యకారులు ఆర్థికాభివృద్ధి సాధించాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య పేర్కొన్నారు. షాబాద్ మండల పరిధిలోని చందనవెళ్లి పెద్ద చెరువులో బుధవారం షాబాద్ జెడ్పీటీసీ పట్నం అవినాష్‌రెడ్డితో కలిసి సుమారు 6లక్షల చేపపిల్లలను వదిలారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ... వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో షాబాద్, చందనవెళ్లి చేరువుల్లో నీరు చేరడంతో చేపలను వదిలినట్లు చెప్పారు. గతంలో ఏ ప్రభుత్వం మ త్స్యకారులను పట్టించుకోలేదన్నారు. మిషన్ కాకతీయతో చెరువులకు పూర్వ వైభవం తీసు కువచ్చిన ఘనత సీఎంకే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్య శాఖ జిల్లా అధికారి సుచరిత, సర్పంచ్‌లు ప్రభాకర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు శ్రీరాంరెడ్డి, రాందేవ్‌యాదవ్, ప్రభాకర్ తదితరులున్నారు.

మోకిల రైతులకు ప్లాట్‌నంబర్ల కేటాయింపు

శంకర్‌పల్లి: శంకర్‌పల్లి మండలంలోని మోకిల వద్ద చేసిన హెచ్ఎండీఏ వెంచర్‌లో భూమిని కోల్పోయిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ప్లాట్ నంబర్లను కేటాయించింది. బుధవారం మోకిలలోని రైతువేదిక వద్ద చేవెళ్ల ఆర్డీఓ సాయిరాం, తహసీల్దార్ సురేందర్, ఆర్ఐ విక్రమ్ రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మండలంలోని మోకిల వద్ద ఉన్న సర్వే నంబర్ 197లో హెచ్ఎండీఏ వెంచర్‌లో భూములను ప్రభుత్వానికి అప్పగించిన 133 మంది రైతులకు ప్లాట్ల నంబర్లను కేటాయించారు. ఆర్డీఓ మాట్లాడుతూ.. హెచ్ఎండీఏ రూల్స్ ప్రకారం ముందుగా భూమిని తీసుకున్న రైతులకు ఇవ్వాల్సిన దాని ప్రకారం వారికి ప్లాట్ల నంబర్లను కేటాయించారని చెప్పారు. ఇక తదుపరి కార్యక్రమాలు హెచ్ఎండీఏ చేసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎండీఏ అధికారులు, స్థానిక నాయకులు, రైతులు పాల్గొన్నారు.

'బోగస్'కు తావులేదు

ఆరోపణలున్న ప్రాంతాల్లో తనిఖీలు చేస్తున్నాం

- ఓటరు నమోదు ప్రక్రియ వేగంగా సాగుతోంది
- వందశాతం ఓటింగే లక్ష్యం
- 'సాక్షి'తో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరీష్



సాక్షి, రంగారెడ్డిజిల్లా: జిల్లాలో బోగస్ ఓట్లకు ఆస్కారమే లేదని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరీష్ స్పష్టం చేశారు. బుధవారం ఆయన 'సాక్షి' ప్రతినిధితో ప్రత్యేకంగా మాట్లాడారు. జిల్లాలో ఓటర్ నమోదు ప్రక్రియ వేగంగా కొనసాగుతోందని చెప్పారు. ఓటర్ల జాబితాను పూర్తి పారదర్శకంగా నిర్వహించడంతో పాటు ఎప్పటికప్పుడు రాజకీయ పార్టీలతో సమావేశమై జాబితాపై చర్చిస్తున్నామన్నారు. నియోజకవర్గాలు, పోలింగ్ బూత్ లవారీగా నమోదవుతున్న కొత్త ఓటర్ల జాబితాను అన్ని పార్టీల నాయకులకు అందిస్తున్నామన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటరుగా అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు. వందశాతం ఓటింగ్ లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

ఇంటి నంబర్లు లేకపోవడం వల్లే..

జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల్లో 3,369 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశాం. వీటి పరిధిలో మొత్తం 31,99,674 మంది ఓటర్లు ఉన్నారు. అత్యధికంగా శేరిలింగంపల్లి నియోజకవర్గంలో 6,62,358 మంది ఓటర్లు ఉన్నారు. అత్యల్పంగా షాద్‌నగర్ నియోజకవర్గంలో 2,10,948 మంది ఓటర్లు ఉన్నారు. అయితే శేరిలింగంపల్లిలోని ఓ ఇంటి నంబర్‌పై లక్షకుపైగా ఓట్లు ఉన్నట్లు ఫిర్యాదులు వచ్చాయి. ఈ విషయమై వెంటనే అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టారు. మురికివాడలు, ప్రభుత్వ భూముల్లో తాత్కాలిక గుడిసెలు వేసుకుని జీవిస్తున్నవారు సమీపంలోని పట్టా భూముల్లోని ఇంటినంబర్లపై దరఖాస్తు చేసుకున్నట్లు తేలింది. ఇక్కడ బోగస్ ఓట్లు లేవు. దరఖాస్తు చేసుకున్నవారికి సొంతంగా ఇంటి నంబర్ లేకపోవడం వల్లే ఆ పక్కన ఉన్న ఇంటి నంబర్లపై దరఖాస్తు చేసుకోవాల్సి వచ్చింది. మహేశ్వరం, రాజేంద్రనగర్, ఎల్బీనగర్ నియోజకవర్గాల నుంచి కూడా పలు ఫిర్యాదులు అందాయి. తనిఖీ బృందాలు వాటిని కూడా పరిశీలిస్తున్నాయి.

ప్రత్యేక శిబిరాలు..

బూత్‌స్థాయి అధికారులు, సూపర్‌వైజర్లతో కూడిన 116 బృందాలు రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధుల సహకారంతో 1,114 అపార్ట్‌మెంట్లలో ప్రత్యేక శిబిరాలు నిర్వహించాం. ఈ సందర్భంగా ఫారం-6 దరఖాస్తులు 10,275 వచ్చాయి. ఫారం-8 దరఖాస్తులు 5,495 వచ్చాయి. వాటిని వీలైనంత త్వరగా పరిష్కరిస్తాం. అంతేకాదు సర్వే బృందాలు మొత్తం 15,49,110 గృహాలను సందర్శించి కొత్త ఓటర్ల నమోదుకు సంబంధించి 5,628 ఫారం-6 దరఖాస్తులు, 11,659 ఫారం-8 దరఖాస్తులు, 6,841 ఫారం-7 దరఖాస్తులు సేకరించాయి. స్వీప్‌లో భాగంగా చేపట్టిన వివిధ కార్యక్రమాల ద్వారా వచ్చిన వాటిలో మొత్తం 99,358 ఫారమ్-6 దరఖాస్తులను, 26,245 ఫారమ్-8 దరఖాస్తులను ఆమోదించడం జరిగింది.

తక్కువ పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి..

గత ఎన్నికల్లో తక్కువ పోలింగ్ శాతం నమోదైన పోలింగ్ స్టేషన్లను ఇప్పటికే గుర్తించాం. ఈసారి ఓటర్లకు అవగాహన కల్పించి ప్రతి ఒక్కరూ ఓటు వేసేలా చూస్తున్నాం. 100 శాతం పోలింగ్ నమోదే లక్ష్యంగా పనిచేస్తున్నాం. ఎప్పటికప్పుడు రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమై బీఎల్‌ఓల దగ్గర ఉన్న ఓటర్ల జాబితాను విధిగా పరిశీలించాలని సూచిస్తున్నాం. సెక్స్ వర్కర్లు, ట్రాన్స్‌జెండర్స్ అందరినీ గుర్తించి కేటగిరీ వైజ్‌గా అర్హులైన ప్రతి ఒక్కరిని ఓటరుగా నమోదు చేస్తున్నాం. కాలేజీ మరియు పాఠశాలల్లో ఓటర్ అవేర్‌నెస్ ప్రోగ్రాం ఏర్పాటు చేసి.. బీఎల్‌ఓ యాప్ మరియు ఓటర్ హెల్ప్‌లైన్‌పై అవగాహన కల్పిస్తున్నాం.



కొత్తందాలతో బాలాపూర్ పెద్ద చెరువు

ఆహ్లాదం @ బాలాపూర్

- ముగింపు దశకు పెద్దచెరువు సుందరీకరణ పనులు
- వాకింగ్ ట్రాక్, గార్డెనింగ్ ఏర్పాటు
- త్వరలో మంత్రి సబితారెడ్డి చేతులమీదుగా ప్రారంభం



లేక్ ఫ్రంట్ వ్యూ

బడంగ్‌పేట్: బాలాపూర్‌లోని పెద్దచెరువు బడంగ్‌పేట కార్పొరేషన్‌లో ఒక కలికితురాయిగా మిగిలిపోనుంది. రూ.2 కోట్లతో చేపట్టిన చెరువు సుందరీకరణ పనులు ముగింపు దశకు చేరుకున్నాయి. మిగిలిన పనులు త్వరలో పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నారు. మంత్రి సబితారెడ్డి ప్రత్యేక చొరవతో హెచ్ఎండీఏ నుంచి రూ.2 కోట్లు మంజూరు చేయించి అప్పట్లో చెరువు సుందరీకరణ పనులను ప్రారంభించారు. చెరువు కట్టను సుమారు కిలోమీటర్ మేర సుందరంగా తీర్చిదిద్దారు. పాలిష్ బండలతో వాకింగ్ ట్రాక్‌తో పాటు.. స్టీల్ రాడ్లతో గ్రిల్స్ ఏర్పాటు చేశారు. చెరువు కట్టపై బైక్‌లు వెళ్లకుండా పొడుగు దిమ్మెలను ఏర్పాటు చేశారు. ఎంట్రెన్స్ వద్ద పెద్ద అక్షరాలతో బాలాపూర్ లేక్ ఫ్రంట్ పార్కు అని రాయించి దాని చుట్టూ గార్డెనింగ్ ఏర్పాటు చేశారు. సందర్శకులు కూర్చునేందుకు రాతిబల్లలు ఏర్పాటు చేశారు. రాత్రి సమయంలో ఎవరూ చెరువుకట్టపై రాకుండా రక్షణగా గేట్లు బిగించారు. అలుగు పారే దగ్గర, లేక్‌వ్యూ వద్ద పూల మొక్కలు ఏర్పాటు చేశారు. త్వరలో మంత్రి సబితారెడ్డి చేతులమీదిగా పెద్ద చెరువును ప్రారంభిస్తారని అధికారులు పేర్కొంటున్నారు.

> **పనులు పూర్తికావచ్చాయి**
>
> 
>
> మొదట్లో బాలాపూర్ పెద్ద చెరువు కాలుష్యానికి గురైంది. రూ.2 కోట్ల హెచ్ఎండీఏ నిధులు వెచ్చించి సుందరీకరణ పనులు మొదలు పెట్టాం. ప్రస్తుతం పనులు పూర్తికావచ్చాయి. ఈ చెరువు సుందరీకరణతో బాలాపూర్‌కే అందం వచ్చింది. నిధుల మంజూరుకు సహకరించిన సీఎం కేసీఆర్‌కు, మంత్రి కేటీఆర్, హెచ్ఎండీఏ అధికారులకు ధన్యవాదాలు. త్వరలోనే ప్రారంభిస్తాం.
>
> – సబితారెడ్డి, విద్యాశాఖమంత్రి

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి, సంక్షేమం

- ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్



వాటర్ ట్యాంక్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

తలకొండపల్లి: బీఆర్ఎస్ సర్కార్ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. తలకొండపల్లి మండల పరిధిలోని గడ్డమీది తండా, వెంకట్రావ్‌పేట్ గ్రామాల్లో జెడ్పీటీసీ వెంకటేశ్‌తో కలిసి బుధవారం పలు అభివృద్ధి కార్యక్రమాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. వెంకట్రావ్‌పేట్ గ్రామంలో రూ.10 లక్షలతో మహిళా సమాఖ్య భవనం నిర్మించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ నిర్మల, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీనివాస్ యాదవ్, ఎంపీటీసీ సరిత, గణేష్‌గుప్తా, సర్పంచ్‌లు హైమావతి, రమేష్, ఈశ్వర్, గోపాల్‌నాయక్, లక్ష్మణ్‌నాయక్, ఉప సర్పంచ్‌లు రవి, శేష్యనాయక్, బీఆర్ఎస్ నాయకులు.. దశరథ్‌నాయక్, శివశంకర్ రెడ్డి, రాజేందర్‌రెడ్డి, శ్రీశైలంగౌడ్, ఏఎంసీ డైరెక్టర్ రమేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అధికారపార్టీకి 'కోరుపోలు' రాజీనామా

ఎంపీపీ, ఎంపీటీసీ పదవులను వదులుకుంటున్నట్లు వెల్లడి



రాజీనామాపత్రాలను జెడ్పీసీఈఓకు అందజేస్తున్న కోరుపోలు

మహేశ్వరం: మహేశ్వరం ఎంపీపీ కోరుపోలు రఘుమారెడ్డి తన ఎంపీపీ, ఎంపీటీసీ రెండు పదవులకు రాజీనామా చేశారు. జెడ్పీసీఈఓ దిలీప్‌ని బుధవారం కలిసిన కోరుపోలు.. తన రాజీనామా లేఖను అందించారు. 2019 ఎంపీటీసీ ఎన్నికల్లో ఘట్టుపల్లి ఎంపీటీసీగా (బీఆర్ఎస్) కోరుపోలు గెలుపొందారు. అధికార బీఆర్ఎస్ పార్టీ సహాయంతో ఎంపీపీగా ఎన్నికయ్యారు. అయితే ఈనెల 12న బీఆర్ఎస్ పార్టీని వీడిన కోరుపోలు.. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ క్రమంలో ఎంపీపీ, ఎంపీటీసీ రెండు పదవులకు ఆయన రాజీనామా చేశారు.

అంతకుముందు..

బీఆర్ఎస్ గుర్తుపై గెలిచి కాంగ్రెస్‌లో చేరిన రఘుమారెడ్డి పదవికి రాజీనామా చేయాలని అంతకుముందు స్థానిక బీఆర్ఎస్ నేతలు డిమాండ్ చేశారు. అయితే కోరుపోలు రాజీనామాతో అన్నింటికి పులిస్టాప్ పడినట్లయ్యింది.

మట్టి వినాయకులనే ప్రతిష్ఠించండి: కలెక్టర్

ఇబ్రహీంపట్నం రూరల్: కాలుష్య నివారణ కోసం ప్రతి ఒక్కరూ మట్టి వినాయకులనే ప్రతిష్ఠించాలని కలెక్టర్ హరీశ్ తెలిపారు. గణేష్ చతుర్థిని పురస్కరించుకొని బుధవారం కలెక్టరేట్‌లో హరీశ్.. ఉద్యోగులకు మట్టి విగ్రహాలు అందజేశారు. పీఓపీ విగ్రహాలను ప్రతిష్ఠించడం తగ్గించాలని కోరారు. పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అన్నారు. జిల్లా కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ ఇంజనీర్ వెంకటనర్సు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ పంచాయతీగా 'నేదునూరు'

- స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా ఎంపిక
- జిల్లా నుంచి ఏకైక పంచాయతీగా రికార్డు



నేదునూరు గ్రామ పంచాయతీ కార్యాలయం

కందుకూరు: స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా మండల పరిధిలోని నేదునూరు గ్రామ పంచాయతీ రాష్ట్రస్థాయిలో ఉత్తమ గ్రామ పంచాయతీ అవార్డుకు ఎంపికయ్యిందని ఎంపీడీఓ వెంకట్రాములు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలో చేపట్టిన వివిధ అంశాలను ప్రాతిపదికన తీసుకుని అవార్డుకు ఎంపిక చేశారని తెలిపారు. గురువారం రాజేంద్రనగర్‌లోని రాష్ట్ర శిక్షణాభివృద్ధి సంస్థ ప్రధాన కార్యాలయంలో గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు చేతుల మీదుగా నేదునూరు సర్పంచ్ మరియు పంచాయతీ కార్యదర్శికి అవార్డు అందజేయనున్నట్లు ఎంపీడీఓ తెలిపారు.

అంశాల ప్రాతిపదికన..

2023-24 సంవత్సరానికి గాను రాష్ట్రంలోని ప్రతి మండలంలో అధిక జనాభా ఉన్న గ్రామ పంచాయతీని ఎంపిక చేసుకుని అందులో అంశాల ప్రాతిపదికన సర్వే చేపట్టారు. అన్నీ పరిశీలించిన అనంతరం రంగారెడ్డి జిల్లా పరిధిలో నేదునూరు గ్రామ పంచాయతీని అధికారులు రాష్ట్రస్థాయిలో ఈ అవార్డుకు ఎంపిక చేశారు.

పెద్ద పంచాయతీ..

నేదునూరు గ్రామ పంచాయతీ కందుకూరు మండలంలోనే పెద్ద గ్రామ పంచాయతీ. గ్రామ జనాభా 7వేలకు పైగా ఉంది. ఓటర్లు దాదాపుగా 4500 మంది ఉన్నారు. జనాభాలో అధిక శాతం వ్యవసాయంపైనే ఆధారపడి ఉంది. కాగా ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలు, వీధి దీపాలు, చెత్త సేకరణ, పారిశుద్ధ్యం, సీసీ రహదారులు, భూగర్భ డ్రైనేజీ నిర్మాణాలు, ఇంకుడుగుంతలు, మరుగుదొడ్ల నిర్మాణాలు, పల్లెప్రకృతి వనం, వైకుంఠ ధామాల ఏర్పాటు, రహదారుల వెంట మొక్కల పెంపకం, పాఠశాలల అభివృద్ధి తదితర అంశాల్లో ముందంజలో ఉన్నట్లు అధికారులు నిర్ధారించారు. దీంతో అధికారులు ఆ గ్రామాన్ని రాష్ట్రస్థాయిలోనే ఉత్తమ పంచాయతీగా ఎంపిక చేశారు.

> **అందరి ప్రోత్సాహంతోనే**
>
> 
>
> నేదునూరు గ్రామ పంచాయతీ రాష్ట్రస్థాయిలో ఉత్తమ పంచాయతీ అవార్డుకు ఎంపిక కావడం చాలా సంతోషంగా ఉంది. ఈ అవార్డుతో నాపై బాధ్యత మరింత పెరిగింది. గ్రామంలో చేపట్టే ప్రతి పనిలో మంత్రి సబితారెడ్డి చొరవతో పాటు వార్డు సభ్యులు, గ్రామస్తుల సహకారం, ప్రోత్సాహం ఎంతో ఉంది.
>
> – రామకృష్ణారెడ్డి, సర్పంచ్, నేదునూరు

కుర్మిద్దలో ఫార్మా అవుట్ పోస్టు



అవుట్ పోస్టును ప్రారంభిస్తున్న ఏసీపీలు శ్రీనివాస్‌రావు, శ్రీనివాస్

- నక్కర్తమేడిపల్లి గ్రీన్ ఫార్మాసిటీ పీఎస్‌కు అనుసంధానంగా సేవలు
- కందుకూరు మండల ప్రజల సౌలభ్యం కోసం ఏర్పాటు

యాచారం: బీఆర్ఎస్ సర్కార్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గ్రీన్ ఫార్మాసిటీకి భద్రతా ఏర్పాట్లలో భాగంగా యాచారం మండలం కుర్మిద్ద గ్రామ సమీపంలో ఫార్మా అవుట్ పోస్టును నిర్మించారు. ఈ అవుట్ పోస్టును బుధవారం మహేశ్వరం, ఇబ్రహీంపట్నం ఏసీపీలు శ్రీనివాస్‌రావు, శ్రీనివాస్ ప్రారంభించారు. యాచారం, కందుకూర్ పోలీస్ స్టేషన్ల పరిధిలోని 19 గ్రామ పంచాయతీ, అనుబంధ గ్రామాలకు సంబంధించి నక్కర్తమేడిపల్లిలో గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్‌ను ఇదివరకే ప్రారంభించిన విషయం తెలిసిందే. అయితే కందుకూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆకులామైలారం, సాయిరెడ్డిగూడ, మీరాఖాన్‌పేట తదితర గ్రామాల నుంచి 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న నక్కర్తమేడిపల్లి గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్‌కు వెళ్లాలంటే ప్రజలు ఆసక్తి చూపడం లేదు. ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, ప్రజలు మొదటినుంచి మేము అక్కడికి వెళ్లలేం అంటూ తమ సమస్యను మంత్రి సబితారెడ్డి, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వారి విజ్ఞప్తి మేరకు పోలీస్ ఉన్నతాధికారులతో మాట్లాడిన మంత్రి ప్రభుత్వంతో మాట్లాడి నక్కర్తమేడిపల్లి గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్టేషన్‌కు అనుసంధానంగా కుర్మిద్ద గ్రామ రెవెన్యూ పరిధిలో పోలీస్ అవుట్ పోస్టు ఏర్పాటు చేయించారు.

భవిష్యత్‌లో శాశ్వత భవనం!

కుర్మిద్దలో కొత్తగా ప్రారంభించిన పోలీస్ అవుట్ పోస్టులో నిత్యం ఒక ఎస్ఐతో పాటు 5 మంది కానిస్టేబుళ్లు సేవలు అందిస్తారు. ఒక మొబైల్ వాహనం అందుబాటులో ఉంటుంది. గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్‌కు అనుసంధానంగా అవుట్ పోస్టు సేవలు అందించనుంది. కందుకూర్, యాచారం పోలీస్ స్టేషన్ల పరిధి గ్రామాలకు మధ్యలో ఉన్న కుర్మిద్ద గ్రామంలోనే భవిష్యత్‌లో గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్ శాశ్వత భవనాన్ని నిర్మించే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ కార్యక్రమంలో యాచారం, గ్రీన్ ఫార్మాసిటీ, కందుకూర్ పోలీస్ స్టేషన్ల సీఐలు సైదయ్య, రామాంజనేయులు, విష్ణువర్ధన్‌రెడ్డి, ఎస్ఐ ప్రసాద్ పాల్గొన్నారు.

'తపాలా' సేవలను వినియోగించుకోవాలి

- హైదరాబాద్ సౌత్, ఈస్ట్ సీనియర్ సూపరింటెండెంట్ శర్మ



సమావేశంలో మాట్లాడుతున్న శర్మ

హయత్‌నగర్: భారతీయ తపాలాశాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న సేవలను, పథకాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని తపాలాశాఖ హైదరాబాద్ సౌత్, ఈస్ట్ సీనియర్ సూపరింటెండెంట్ టీఏవీ.శర్మ సూచించారు. పెద్దఅంబర్‌పేట పురపాలక సంఘం పసుమాములలో బుధవారం స్థానిక బీఓ ఆధ్వర్యంలో నిర్వహించిన డీఏకే కమ్యూనిటీ డెవలప్‌మెంట్ కార్యక్రమానికి తపాలాశాఖ ఈస్ట్ సబ్‌డివిజన్ ఐపీ వెంకట్‌రెడ్డితో కలిసి శర్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పిల్లలు, యువకులు, వృద్ధులు ఇలా అన్ని వయసుల వారికి అవసరమయ్యే పథకాలను తపాలాశాఖ తీసుకువచ్చిందని తెలిపారు. ఆధార్ అప్‌డేట్, ఇన్సూరెన్స్ పథకాలు, సేవింగ్ ఖాతాలు, ఫిక్స్‌డ్ డిపాజిట్ ఖాతాలు తదితర అంశాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మైలోవర్ భాస్కర్, బీపీఎం ప్రశాంతి, మల్లేష్, వివిధ బ్రాంచ్‌ల బీపీఎంలు, తపాలా సిబ్బంది, పోస్టాఫీస్ ఖాతాదారులు పాల్గొన్నారు.

రెసిడెన్షియల్ జోన్‌లోకి మార్చండి

- హార్డ్‌వేర్ పార్క్ భూములపై అఖిలపక్ష నేతల రౌండ్ టేబుల్ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న టీజేఎస్ అధ్యక్షుడు, ప్రొఫెసర్ కోదండరామ్

పంజగుట్ట: హార్డ్‌వేర్ పార్క్ పరిధిలో ఉన్న భూములను ఇండస్ట్రియల్ జోన్ నుంచి రెసిడెన్షియల్ జోన్‌కు మార్చాలని అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో.. హార్డ్‌వేర్ పార్క్ వ్యతిరేక పోరాట కమిటీ జేఏసీ, తెలంగాణ జనసమితి రంగారెడ్డి జిల్లా సంయుక్త ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లాలోని నాదర్‌గుల్, ఆదిబట్ల, ఎంఎం కుంట గ్రామాల్లోని ఎక్స్‌టెన్షన్ హార్డ్‌వేర్ పార్క్‌ను తొలగించాలని డిమాండ్ చేస్తూ బుధవారం అఖిలపక్ష రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ జనసమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కోదండరెడ్డి, అద్దంకి దయాకర్, బీజేపీ మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు, న్యూడెమోక్రసీ నాయకుడు గోవర్ధన్ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్, రాష్ట్ర మంత్రులు పేదల భూములు లాక్కొని రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని ఆరోపించారు. హార్డ్‌వేర్ పార్క్ కోసం 2004 సంవత్సరంలో.. 1500 ఎకరాలు నివాస స్థలాలు, 1500 ఎకరాలు వ్యవసాయ భూములు, ప్రైవేట్ భూములు ఎంపికచేసి ఇండస్ట్రియల్ జోన్‌కింద నిషేధిత జాబితాలో చేర్చారని తెలిపారు. ఆయా భూయజమానులకు కనీసం నోటీసులు, నష్టపరిహారం ఇవ్వకుండా నిషేధిత జాబితాలో చేర్చడంతో భూమిపై వారే ఉన్నప్పటికీ క్రయవిక్రయాలకు అవకాశం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. నిషేధిత జాబితాలో ఉండటంతో ఆ ప్రాంతంలో అభివృద్ధి జరగడంలేదని, ఇళ్లు కట్టుకునేందుకు అవకాశం లేకుండా పోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ఇండస్ట్రియల్ జోన్‌లో ఉన్న భూములను రెసిడెన్షియల్ జోన్‌లోకి మార్చాలని.. తమ భూములను ధరణిలో చేర్చడంతోపాటు రైతుబంధు ఇవ్వాలని డిమాండ్ చేశారు. హార్డ్‌వేర్ పార్క్ వ్యతిరేక పోరాట కమిటీ జేఏసీ చైర్మన్ రామేశ్వర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆ జేఏసీ కన్వీనర్ సత్యం, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు సుధాకర్, లింగోజిగూడ కార్పొరేటర్ రాజశేఖర్‌రెడ్డి, నరేష్, శ్రీధర్ రెడ్డి, రవికాంత్, హన్మంతురెడ్డి, వేణుగోపాలరావు, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ భూములను కబ్జా చేస్తే ఊరుకోం



హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయిస్తున్న శేఖర్ తదితరులు

దేవాదాయ ధర్మాదాయ శాఖ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ శేఖర్

మంచాల: దేవాలయాలకు సంబంధించిన భూములను కబ్జా చేస్తే సహించేది లేదని దేవాదాయ ధర్మాదాయ శాఖ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ శేఖర్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని ఆరుట్ల శ్రీ రామచంద్ర స్వామి(శ్రీవేణుగోపాల స్వామి) ఆవాలయ మాన్యం భూమిలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆలయం పేరు మీద ఆరుట్ల గ్రామంలో 1581, 1582 సర్వే నంబర్లలో 12.16ఎకరాల భూమి ఉందన్నారు. ఈ భూమిని ఎవరైనా ఆక్రమించేందుకు, అన్యాక్రాంతం చేసేందుకు యత్నించినా చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తూర్పు డివిజన్ దేవాదాయ ధర్మాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ప్రణీత్‌కుమార్, ఈఓ శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్ కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి, ఉప సర్పంచ్ పాండాల జంగయ్య గౌడ్, వార్డు సభ్యులు మోహన్‌రెడ్డి, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు రౌడీషీటర్ల బైండోవర్

అబ్దుల్లాపూర్‌మెట్: వచ్చే వినాయకచవితి, ఎన్నికల నేపథ్యంలో అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఇద్దరు రౌడీషీటర్లను అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ ఎదుట పోలీసులు బుధవారం బైండోవర్ చేశారు. బాటసింగారం గ్రామానికి చెందిన మాదారం సాయికార్తీక్, అబ్దుల్లాపూర్‌కు చెందిన రాహుల్‌లు ప్రజాశాంతికి భంగం కల్గించే విధంగా ప్రవర్తించే అవకాశమున్నందున ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా వారిలో సత్ప్రవర్తన కోసమే బైండోవర్ చేసినట్లు సీఐ మన్మోహన్ తెలిపారు.

PUBLIC NOTICE

This is to inform to the General Public that our client Mrs. Syeda Mairajunnisa W/o Syed Abdul Quadeer, R/o Plot No.7-86/87, Vahid Villa, Golconda Hills, Ibrahimbagh, Hyderabad has entered into an oral agreement of sale with Mr. Lalit Kumar Bansal, Address: R/o. 1504, Darshan Heights, B.M. Marg, Delisle Road, Mumbai, Maharashtra. S/o Yogenranath Jugal Kishor Bansal to purchase his Property ie. Land in Survey No.174, admeasuring 1210 Square Yards, situated at Mudimyal Village, Mudimyal Grampanchayat, Chevella Mandal, Ranga Reddy District by paying substantial sale consideration. As such, if any person or persons having any right, claim and interest over the said property shall approach us at our office with relevant documents within 4 days from this date and after the said period that our client will proceed with sale deed and thereafter no claim shall be entertained.
Hence this notice.

Z.H. JAVID,
MOHD. FAZLUR RAHMAN,
SYED SHOUKAT ALI
Advocates
Off at : 10-2-346/19,
Asif Nagar, Hyderabad.

భర్త వేధిస్తున్నాడని పోలీసులకు ఫిర్యాదు

శంషాబాద్ రూరల్: తనను తరచూ వేధింపులకు గురిచేస్తున్న భర్తపై చర్యలు తీసుకోవాలని ఓ మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసుల కథనం ప్రకారం... మండలంలోని పెద్దగోల్కొండకు చెందిన జ్యోతికి కందుకూరు మండలం పులిమామిడి నివాసి జంగయ్యతో 2008లో వివాహం జరిగింది. వీరికి కొడుకు, కూతురు సంతానం. జ్యోతికి 2009లో ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా ఉద్యోగం వచ్చింది. అప్పటి నుంచి ఆమె బ్యాంకు ఏటీఎం కార్డును భర్త జంగయ్య తన వద్ద పెట్టుకుని జీతం డబ్బులు ఖర్చు చేసుకునేవాడు. వేరే మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని తరచూ భార్యను వేధిస్తున్నాడు. ఈ క్రమంలో పలుసార్లు పెద్దల సమక్షంలో పంచాయితీ జరిగింది. కొన్ని రోజుల కిందట పెద్దగోల్కొండలో జ్యోతి,జంగయ్య దంపతులు కాపురం పెట్టారు. ఆగస్టు 24న భర్తతో గొడవ జరగడంతో జ్యోతి అదే గ్రామంలోని తల్లి ఇంటికి వెళ్లింది. దీంతో అదే రోజు రాత్రి జంగయ్య ఇంట్లోని సామాన్లు తీసుకుని భార్యకు చెప్పకుండా వెళ్లిపోయాడు. అప్పటి నుంచి అతడి నుంచి ఎలాంటి కబురు లేకపోవడంతో బాధితురాలు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'పాలమూరు-రంగారెడ్డితో' సస్యశ్యామలం

- 16న ప్రాజెక్టును జాతికి అంకితం చేయనున్న సీఎం కేసీఆర్
- రాష్ట్రంపై కేంద్రానిది సవతి తల్లి ప్రేమ
- ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కడ్తాల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు ఎత్తిపోతల పథకంలో కల్వకుర్తి నియోజకవర్గం సస్యశ్యామలమవుతుందని కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ అన్నారు. బుధవారం ఆయన పలువురు ప్రజాప్రతినిధులతో కలిసి మండల కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తూ ప్రాజెక్టుల నిర్మాణాలు చేపడుతున్నారన్నారు. రూ.35వేల కోట్లతో నిర్మిస్తు న్న పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుతో ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాలో సుమారు 12.50 లక్షల ఎకరాలకు, కల్వకుర్తి నియోజకవర్గంలో 1.25లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని చెప్పారు. ఈ ప్రాజెక్టు నిర్మాణాన్ని అడ్డుకునేందుకు ఎన్నో కుట్రలు పన్నాయని ఆరోపించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్రంపై సవితితల్లి ప్రేమను చూపుతుందన్నారు. సీఎం కేసీఆర్ ఈనెల 16న పాలమూర్-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టును జాతికి అంకితం చేయనున్నారని, ఇందులో భాగంగా ఈనెల 16న సీఎం కొల్లాపూర్ నియోజకవర్గంలోని నార్లాపూర్‌లోని లిఫ్ట్ మొదటి పంప్‌ను సీఎం ప్రారంభించనున్నారని తెలిపారు. పోలవరం ప్రాజెక్టుకు జాతీయహోదా ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం తెలంగాణలోని కాళేశ్వరం, పాలమూర్-రంగారెడ్డి ప్రాజెక్టుకు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. తెలంగాణకి ఇవ్వాల్సిన రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం గనుల ఫ్యాక్టరీ, గిరిజన వర్సిటీ ఎందుకు కేటాయించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. 157 మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేసిన మోదీ ప్రభుత్వం తెలంగాణకు ఒక్క కళాశాలను కేటాయించలేదన్నారు. సాగునీటి ప్రాజెక్టులపై డీకే అరుణ, వైఎస్ షర్మిల అవగాహన రాహిత్యంతో మాట్లాడుతున్నారన్నారు. ఈ నెల 16న నిర్వహించే సీఎం కేసీఆర్ సభకు పెద్ద ఎత్తున నియోజకవర్గం నుంచి తరలివెళ్తామన్నారు. జెడ్పీటీసీ సభ్యులు దశరథ్‌నాయక్, వెంకటేశ్, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, ఎంపీపీ నిర్మల పాల్గొన్నారు.

2018 ఫలితాలే పునరావృతం

ఎప్పుడు ఎన్నికలు వచ్చిన కల్వకుర్తి బీఆర్‌ఎస్ అభ్యర్థి జైపాల్‌యాదవ్‌ని భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని జెడ్పీటీసీలు దశరథ్‌నాయక్, ఉప్పల వెంకటేశ్, మార్కెట్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ నిర్మల శ్రీశైలంగౌడ్ అన్నారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ అభివృద్ధి పథకాలే బీఆర్‌ఎస్‌ను గెలిపిస్తాయన్నారు. కల్వకుర్తిలో 2018 ఎన్నికల ఫలితాలే పునరువృతమవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గోపాల్‌నాయక్, ఉప సర్పంచ్ కడారి రామకృష్ణ, సింగిల్ విండో డైరెక్టర్ సేవ్యానాయక్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు సత్రి, నాయకులు భీమన్, శ్రీను, సూర్యానాయక్, రాజశేఖర్, మహేశ్, పాండు తదితరులున్నారు.

'బీజేపీ, బీఆర్‌ఎస్'లది చీకటి ఒప్పందం

కాంగ్రెస్ మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిశీలకుడు కుమార మంగళం



సమావేశంలో మాట్లాడుతున్న కుమార మంగళం

షాద్‌నగర్: కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని బీఆర్‌ఎస్‌లు చీకటి ఒప్పందం కుదుర్చుకున్నాయని కాంగ్రెస్ పార్టీ మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిశీలకుడు కుమార మంగళం అన్నారు. బుధవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కుమార మంగళం మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ఢిల్లీకి వెళ్లి బీజేపీతో రహస్య ఒప్పందం కుదుర్చుకున్నారని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పార్టీ అధిష్టానం పావులు కదుపుతుందని.. ఇందుకు పార్టీ శ్రేణులు సైతం సైనికుల్లా పనిచేయాలన్నారు. రాష్ట్ర ప్రజల మనోభావాలను గౌరవించి పార్టీ అధినేత్రి సోనియా గాంధీ ప్రత్యేక రాష్ట్రం ఇచ్చిందన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ ను గెలిపించి ఆమెకు బహుమానం ఇద్దామన్నారు. ఈ నెల 17న విజయభేరి సభకు పెద్ద ఎత్తున హాజరవ్వాలన్నారు. బోగస్ ఓట్లపై పార్టీ నేతలు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. వచ్చే ఎన్నికల్లో కేంద్రంలో.. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ విజయం ఖాయమన్నారు. ఈ సమావేశంలో నాయకులు బాబర్‌ఖాన్, చల్లా శ్రీకాంత్‌రెడ్డి, రఘు, చెన్నయ్య, కృష్ణారెడ్డి, జితేందర్‌రెడ్డి, ఖదీర్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

ఆగి ఉన్న డీసీఎంను ఢీకొట్టి..

నవ వరుడి దుర్మరణం



కుమార్(ఫైల్)

ఆమనగల్లు: ఆగి ఉన్న డీసీఎంను బైక్ ఢీకొట్టడంతో ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. ఈ ఘటన పట్టణ సమీపంలోని హైదరాబాద్-శ్రీశైలం రహదారిపై జరిగింది. పోలీసులు తెలిపిన ప్రకారం .. కడ్తాల్ మండలం ఎక్వాయిపల్లికి చెందిన ఈర్లపల్లి కుమార్ ప్రైవేటు ఉద్యోగి. బుధవారం విధులు ముగించుకుని తన బైక్‌పై రాత్రి స్వగ్రామానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో పట్టణ సమీపంలో ఆగి ఉన్న డీసీఎంను ఢీ కొట్టాడు. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి మూడు నెలల క్రితమే వివాహమైంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ బలరాం తెలిపారు.

యాదవుల ఆర్థికాభివృద్ధికి గొర్రెల పంపిణీ

చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య



దామరగిద్దలో గొర్రెలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే తదితరులు

చేవెళ్ల: గొల్లకురుమల ఆర్థిక అభివృద్ధే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టిందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండల పరిధిలోని దామరగిద్ద గ్రామంలో బుధవారం లబ్ధిదారులకు ఐదు యూనిట్ల గొర్రెల పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తరువాత అన్ని కులవృత్తులను గౌరవించుకునే విధంగా సీఎం కేసీఆర్ వారికి సహాయ సహకారాలను అందిస్తున్నారని చెప్పారు. అనంతరం గ్రామంలోని అంబేడ్కర్ భవనం ప్రహరీ నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎం. వెంకటేశంగుప్తా, చేవెళ్ల ఎంపీపీ ఎం.విజయలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు ఎం.మాలతి, మార్కెట్ కమిటీ చైర్మన్ మిట్ట వెంకటరంగారెడ్డి, వైస్ ఎంపీపీ శివప్రసాద్, వైస్ చైర్మన్ బి.నర్సింలు, నాయకులు రమణారెడ్డి, నరేందర్, పి.ప్రభాకర్, గని, ఫయాజ్, నాగార్జున్‌రెడ్డి, కురుమ సంఘం నాయకులు నర్సింలు, అనిల్, రామస్వామి, వెంకటేశ్, దేవునిఎర్రవల్లి సర్పంచ్ మానిక్యరెడ్డి, మాజీ సర్పంచ్ రాంరెడ్డి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

అనారోగ్యంతో బాధపడే వారు ఆర్థిక ఇబ్బందులు పడకూడదనే సీఎంఆర్‌ఎఫ్ నుంచి చెక్కులు అందజేస్తున్నట్లు ఎమ్మెల్యే కాలె యాదయ్య చెప్పారు. బుధవారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బాధితులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఆయా గ్రామాల సర్పంచులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పట్టపగలే చోరీ

శంకర్‌పల్లి: మున్సిపల్ పరిధిలోని అయ్యప్పరెడ్డి గూడ కాలనీలో పట్ట పగలే చోరీ జరిగింది. బాధితుడు, కాలనీవాసులు తెలిపిన ప్రకారం.. కాలనీకి చెందిన కటికె మహేశ్ మంగళవారం 3గంటల సమయంలో భోజనం చేసి తాళం వేసి బయటకు వెళ్లాడు. రాత్రి తిరిగి ఇంటికి వచ్చి చూడగా తాళం పగులగొట్టి ఉండడంతో ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తెరిచి ఉంది. గుర్తు తెలియని దుండగులు బీరువాలోని రూ.27వేల నగదు ఎత్తుకెళ్లారు. పక్కింటి సీసీ కెమెరాను పరిశీలించగా ఓ వ్యక్తి ఇంట్లోకి వెళ్లినట్లు గుర్తించారు. దీంతో బాధితుడు శంకర్‌పల్లి పోలీసులను ఆశ్రయించాడు. సీసీ కెమెరా ఆధారంగా అనుమానంగా ఉన్న వ్యక్తులను విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎయిర్‌పోర్ట్‌లో బంగారం పట్టివేత



శంషాబాద్: ఇద్దరు వేర్వేరు ప్రయాణికులు అక్రమంగా తీసుకొచ్చిన బంగారాన్ని కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. బుధవారం మధ్యాహ్నం దుబాయ్ నుంచి వచ్చిన ప్రయాణికులకు కస్టమ్స్ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో ఓ వ్యక్తి వద్ద ఉన్న నెబలైజర్ యంత్రం విప్పి చూడగా అందులో 465 గ్రాముల బంగారం బయటపడింది. బంగారం విలువ రూ.28 లక్షలుంటుందని అధికారులు నిర్ధారించారు. మరో ప్రయాణికుడి లగేజీని తనిఖీ చేయగా అందులో.. కార్లను శుభ్రం చేసే వాక్యూమ్ క్లీనర్ కంప్రెషర్ యంత్రం విప్పగా అందులో 486 గ్రాముల బంగారం బయటపడింది. ఈ బంగారం విలువ రూ.29,27 లక్షలుంటుందని అధికారులు నిర్ధారించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీ..

ద్విచక్ర వాహనదారుడు మృతి

చేవెళ్ల: గుర్తుతెలియని వాహనం బైక్‌ను ఢీకొట్టడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ దుర్ఘటన చేవెళ్ల పీఎస్ పరిధిలోని ఖానాపూర్ స్టేజీ సమీపంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపి న ప్రకారం.. వికారాబాద్ జిల్లా పూడూరు మండ లం మిర్జాపూర్‌కు చెందిన చాకలి రవి(40) ఖానా పూర్‌కు వచ్చి స్వగ్రామానికి తిరుగు ప్రయాణమయ్యాడు. చాయ్‌చస్కా హోటల్ వద్ద ఎదురుగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గాయపడిన రవి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలికి వెళ్లి వివరాలు సేకరించారు. మృతుడి వద్ద లభించిన ఆధారాలతో కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బుధవారం పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'కత్తెర పురుగు'తో పంట నష్టం

జిల్లా వ్యవసాయ అధికారిణి గీతారెడ్డి



మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న గీతారెడ్డి

షాద్‌నగర్: మొక్కజొన్న పంటలకు వ్యాపిస్తున్న కత్తెర పురుగును కట్టడి చేసేందుకు రైతులు తగిన మందులు పిచికారి చేయాలని జిల్లా వ్యవసాయ అధికారిణి గీతారెడ్డి అన్నారు. బుధవారం ఆమె ఫరూఖ్‌నగర్‌లో పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా గీతారెడ్డి మాట్లాడుతూ.. మొక్కజొన్న పంట దిగుబడి తగ్గేందుకు కత్తెర పురుగు ప్రధాన కారణం అని చెప్పారు. పంటలకు గొంగళి పురుగు వ్యాపించి ఆకులను తినడంతో కత్తిరించినట్లు కనబడుతుందన్నారు. ఈ పురుగు కాండాన్ని సైతం తొలచి రంధ్రాలను చేసి పంటను తీవ్రంగా నష్టపరుస్తుందని అన్నారు. దీని జీవిత కాలం ఒక నెల నుండి మూడు నెలల వరకు ఉంటుందని వివరించారు. ఈ పురుగు నివారణకు ఒక గ్రాము ఇమామెక్టిన్ బెంజోమెట్ మందును ఒక లీటరు నీటిలో కలిపి కత్తెర పురుగు సోకిన పంటకు పిచికారి చేయాలని సూచించారు. వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలను రైతులు విధిగా పాటించాలని అన్నారు. రైతులు ఫర్టిలైజర్, ఎరువుల దుకాణాలకు వెళ్లి వారు ఇచ్చిన మందులను వాడితే పంట పూర్తిగా చేతికి రాకుండా పోతుందని, తద్వార రైతులు తీవ్రంగా నష్టపోతారని అన్నారు. పంట నష్ట నివారణకు రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి నిషాంత్‌కుమార్, వ్యవసాయ విస్తరణ అధికారులు తేజ్‌కుమార్, నిఖిల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'వాలీబాల్'లో కడ్తాల్ విద్యార్థులు సత్తా



విజేతలతో అధికారులు, ఉపాధ్యాయులు

కడ్తాల్: ఎస్‌జీఎఫ్ జోనల్ అండర్-17 వాలీబాల్ పోటీల్లో కడ్తాల్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరచి ప్రథమ స్థానంలో నిలిచారని ఎస్‌జీఎఫ్ జోనల్ కార్యదర్శి భీముడు తెలిపారు. మాడ్గుల్ మండలం అవురుపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో బుధవారం నిర్వహించిన జోనల్ వాలీబాల్ పోటీల్లో కడ్తాల్ వాలీబాల్ టీం ప్రథమ స్థానంలో నిలిచిందని, ద్వితీయ స్థానంలో తలకొండపల్లి టీం నిలిచిందన్నారు. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రాఘవులు, ఎంఈఓ సర్దార్‌నాయక్, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం విజయభాస్కర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు రాములు, జంగయ్య, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'బ్రూనో' మృతితో విషాదం



పెంపుడు కుక్కతో పట్నం సునీతామహేందర్‌రెడ్డి

బంజారాహిల్స్: 14 ఏళ్లుగా తమ కుటుంబంలో ఒకటిగా మెలిగి తమకు ఎన్నో ఆనందాలు పంచిన పెంపుడు కుక్క మృతితో మంత్రి పట్నం మహేందర్ రెడ్డి ఇంట్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. బంజారాహిల్స్ రోడ్ నెం.12 కమాన్‌లో నివసించే మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి ఇంట్లో పెంపుడు శునకం బ్రూనో మృతి చెందింది. దీంతో ఇంటిల్లిపాది తల్లడిల్లిపోయారు. తమ ఇంట్లో ఒకరిగా మెలిగిన బ్రూనో మృతి మహేందర్ రెడ్డి సతీమణి, జెడ్పీ చైర్మన్ పట్నం సునీతారెడ్డిని తీవ్రంగా కలచివేసింది. తాను బ్రూనో మృతితో తీవ్ర మనోవేదనకు గురైన విషయాన్ని ట్విట్టర్ (ఎక్స్) వేదికగా షేర్ చేశారు. తమ వ్యవసాయ క్షేత్రంలో నిర్వహించిన అంత్యక్రియలను ఫొటోలను షేర్ చేసుకున్నారు.

కంటైనర్ ఢీకొట్టి రూట్ గైడ్ మృతి



శ్రీనివాస్‌రెడ్డి మృతదేహం

అబ్దుల్లాపూర్‌మెట్: రోడ్డు పక్కన నిల్చున్న వ్యక్తిని ఓ కంటైనర్ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. సరూర్‌నగర్ మండలం హరిపురి కాలనీకి చెందిన గుజ్జల శ్రీనివాస్‌రెడ్డి(50) పెద్ద అంబర్‌పేట్ ఓఆర్‌ఆర్ సమీపంలో రూట్‌గైడ్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. మంగళవారం రాత్రి హెచ్‌పీ బంక్ సమీపంలో శ్రీనివాస్‌రెడ్డి నిల్చున్నాడు. అదే సమయంలో ఓ కంటైనర్ రివర్స్ తీస్తున్నాడు. గైడ్‌ను గమనించని డ్రైవర్‌ను ఢీకొట్టడంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. గమనించిన డ్రైవర్ వాహనాన్ని వదిలి అక్కడి నుంచి పరారయ్యాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు.

గుండె పోటుతో యువకుడి మృతి



మురళి (ఫైల్)

శంకర్‌పల్లి: గుండె పోటుతో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన శంకర్‌పల్లి మండలంలోని మోకిల గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. మోకిల గ్రామానికి చెందిన కుమ్మరి మురళి(27)కి బుధవారం తెల్లవారు జామున గుండెపోటు వచ్చింది. దీన్ని గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం వెంటనే శంకర్‌పల్లిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం నిమిత్తం వైద్యులు సంగారెడ్డికి తరలించాలని సూచించారు. ఈ క్రమంలో సంగారెడ్డికి తరలిస్తుండగా మార్గమధ్యలో అతను మృతి చెందాడు.

సైబర్ నేరగాళ్లకు చెక్

సాక్షి, సిటీబ్యూరో: సైబర్ నేరాల కేసుల్లో నిందితులుగా ఉన్న 9 మందిని సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేసినట్లు బుధవారం వెల్లడించారు. వీరిలో ఒకరు సోషల్‌మీడియా ద్వారా వేధించిన వ్యక్తి కాగా..మిగిలిన 8మంది అమాయకులకు ఎరవేసి రూ.2 కోట్ల వరకు కొల్లగొట్టారు. గిఫ్ట్, జాబ్, ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్స్‌లో నిందితులుగా ఉన్న ఉమాకాంత్ దీక్షిత్, శుభం తివారీ, రవికుమార్, అతుల్ శర్మ, షహీన్, నీరజ్‌కుమార్, బిపిన్ కుమార్, బిందేశ్వర్ మండల్ కోసం సిటీ సైబర్ క్రైమ్ పోలీసులకు చెందిన ప్రత్యేక విభాగాలు ఉత్తరాదిలో గాలించాయి. ఎట్టకేలకు వీరిని నగరానికి తీసుకువచ్చి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు.